# నాకీ అదృష్టం చాలు ★

"టి. బి. యేనా ? సందేహం లేదంటారా ? లేక మరో సారి పరీక్ష చేయటం మంచిదా ?" శైలజను పరీక్ష చేసి జబ్బు నిర్ణయించేసేసి వెళ్ళిపోతున్న డాక్టర్ వంక నిస్సహాయంగా చూస్తూ అడిగాడు శ్రీధర్.

"మీరు భలేవారు! మీకు అంత అనుమానంగా వుంటే మరొకరిచేత పరీక్ష చేయించుకోండి. అంతేగాని..." "నా ప్రతిభను అనుమానించకండి అన్నట్లు కోపంగా నవ్వాడు డాక్టర్, శ్రీధర్ యిచ్చినఫీజ్ నిపర్సులోకి నిర్లక్ష్యంగా తోస్తూ.

"అహఁ! నా వుద్దేశం అదిగాదు–" ఏదో చెప్పబోతున్న శ్రీధర్ని మధ్యలోనే ఆపేశాడు డాక్టర్. "ఏదయినా ఫర్వాలేదు. చూడండి! రోగం యింకా చాలా లేతలోనే వుంది. భయపడ వలసిన అవసరం పిసరంతగూడా లేదు. కొంచెం జాగ్రత్త తీసుకుని మందు వాడితే నయమైపోతుంది. వున్న విషయం చెప్పకుండా రోగాన్ని పెంచి పెద్దచేసి ఆ తర్వాత ఏదో పెద్ద రక్షించేసినట్లు హడావుడిచేసి, మిమ్మల్ని తల్లక్రిందులుచేసి డబ్బు సంపాయించవలసిన అగత్యం నాకులేదు. అయినా ఈ రోజు కొత్తగా వైద్యంలో అడుగుపెట్టినవాడ్ని కాదుగా!" బట్టతల సవరించుకుంటూ అంటున్న డాక్టర్కి ఏం జవాబు చెప్పాలో తెలియని శ్రీధర్ క్లుప్తంగా "థ్యాంక్స్ డాక్టర్!" అన్నాడు.

శంభువచ్చి డాక్టర్‌గారి బాగ్ తీసుకువెళ్ళి కారులో పెట్టాడు. మెట్లు దిగి కారుడోరు తెరిచి తనవెనకే వస్తున్న శ్రీధర్ని చూసి ఆగిపోతూ భుజంమీద ఆప్యాయంగా తట్టి "ఫర్వాలేదు, మీరు ధైర్యంగా వుండాలి. ఏవయినా రోగాలు మనుష్యులకి వస్తాయిగాని మానులకి రావుగదా! ఆమెకి ధైర్యం చెప్పండి, వస్తాను." కారులోపల కూర్చుంటూ అన్నాడు డాక్టర్. "వుంటానుడాక్టర్!" కృతజ్ఞతా సూచకంగాచిరునవ్వునవ్వుతూ కారు డోర్‌ని వేసేస్తూ అన్నాడు శ్రీధర్. కారు కదిలి వెళ్ళిపోయింది. టి. బి! అందంగా, హుషారుగా విచారం అంటే యేమిటో యెరుగని దేవకన్యలా వుండే శైలజకి టి. బి. మనుష్యులతో పాటు యింట్లో వాళ్ళ మనశ్శాంతినిగూడా తినేసే మహారోగం. కానీ తనేం చెయ్యగల్డు? క్షణంసేపు లోకం అంతా వూపిరిబిగబట్టి తనవైపు కఠోరంగా చూస్తున్నట్లు అనిపించింది శ్రీధర్‌కి. శైలజ దీనికి యెలా తట్టుకోగలుగుతుంది? వెనక్కు తిరిగి బరువుగా లోపలిగదిలోకి వచ్చాడు శ్రీధర్. గదిలో కుర్చీలో కూర్చునివున్న శైలజ కాలిబాటనవేలువంక రెప్పవాల్చకుండా తదేకంగా చూస్తోంది. శ్రీధర్ అడుగులచప్పుడు శైలజ నిశ్శబ్దతని భంగపరచలేక పోయింది. సామ్రాజ్యాన్ని కోల్పోయిన మహారాణిలా నిస్సహాయంగా, విచారంగా కూర్చున్న భార్యని చూసేసరికి శ్రీధర్‌కి జాలేసింది. దిగులు పడుతున్న శైలజకి తను ధైర్యం చెప్పాలి. అది ముందు తను చేయవలసినపని. తనబాధ, తనగోల తర్వాత.

"శైలా!" దగ్గరగావెళ్ళి కుర్చీ చేతులమీద చేతులు ఆన్చి ఆప్యాయంగా పిల్చాడు శ్రీధర్. కానీ శైలజ తలెత్త

లేదు. కళ్ళు మరింత క్రిందికి వాలిపోయినాయి. గడ్డం వక్ష స్థలాన్ని ఆనుకునేంత దగ్గరగా తల వంచేసుకుంది, ఏదో తప్పు చేసి ఫలితం తెలుసుకోబోతున్న అమాయికపు బాలికలా.

"అరె! యేమిటిది? యింతలోనే అలా అయిపోయా వేమిటి? చూడు! నీ ప్రక్కన నేనుండగా నీకు భయం దేనికీ? అసలు యీ జబ్బువచ్చింది నీకు కాదు, నాకు అనుకో-సరా! యేమిటి? ఏదీ తలెత్తు! యీ మాత్రానికే భయపడ్తే యెలా? ప్రపంచంలో డబ్బు సాధించలేంది ఏదీలేదు. అది మనకుంది. యింక దిగులెందుకు? అవసరంవస్తే నా వుద్యో గాన్ని వదిలేసి డాక్టర్లు నిన్నెక్కడికి తీసుకువెళ్ళమంటే అక్క డకు తీసుకువెడ్తాను, సరా! కాని — కానీ, నువ్విమటుకు యిలా దిగులుగా కూర్చుండిపోయావంటే నాకు జీవితమే స్థం భించి పోయినట్లు వుంటుంది"

తన జుట్టుని, చెంపల్ని ఆప్యాయంగా, మృదువుగా రాస్తున్న భర్తవంక చురుగ్గా కళ్ళెత్తి చూసింది శైలజ. అతనికళ్ళు యెప్పట్లానే నవ్వుతున్నాయి. ఆ కళ్ళలో తనంటే పొంగుతున్న ప్రేమ, అభిమానం పోవడానికి యింక యెంతో కాలం పట్టదుగాబోలు! యేదయినా భరించవచ్చుగాని భర్త మనసులో ఆదరణ లేకుండా యెలా బ్రతకటం? వూహా మాత్రంగానే శైలజ కళ్ళనిండా నీళ్ళు తిరిగాయి. "ఛ, ఛ! యేమిటది? చిన్న పిల్లలా—తప్పుగదూ!"

కాపురానికి వచ్చిన రెండు సంవత్సరాలకి మొట్ట మొదటి సారిగా భార్య కళ్ళల్లో నీళ్ళు చూస్తున్న శ్రీధర్

మనసు చివుక్కుమంది. ఆడవాళ్ళు చీటికి మాటికి యేడుస్తా రని తను విన్నాడు. కొంతమందిని చూశాడు కూడ. కానీ శైలజ తన దగ్గరకు వచ్చిన యీ రెండు సంవత్సరాలలో కళ్ళనీళ్ళు కాదుగదా కనీసం తడి అయినట్లుగా కూడా తను చూడలేదు. ఇదే ఒకసారి తను అడిగితే నవ్వేస్తూ "చాతకాని వాళ్ళు, తెలివితేటలు లేని వాళ్ళు యేడుస్తారు. నాకేం !" అంది. మరి యిప్పుడు? ఇది నిస్సహాయత ! శైలజకున్న అదో రకమైన వ్యక్తిత్వాన్ని బద్దలు చేయడానికి భగవంతుడిస్తున్న గొడ్డలి పెట్టేమో !

"ఇదుగో ! నువ్విలా కూర్చుంటే లాభం లేదు. లే ! అలా కారులో ఓ రౌండ్ తిప్పుకొస్తాను. చూడు, ఫ్లాస్కులో టీ వుందేమో ! లే మరి– నువ్వు బట్టలు మార్చుకోవాలంటే మార్చుకో– నేను కొంచెం ముఖం కడుక్కుని వస్తాను" జబ్బ పట్టి శైలజని లేవదీస్తూ గబగబా అన్నాడు. అతనికిగూడా మనస్సంతా ఏదో తెలియనిబాధతో పొగమంచులా ఆవరించు కుంటోంది.

ఇష్టం లేకపోయినా శ్రీధర్ బలవంతం వల్ల శైలజ బట్టలు మార్చుకుని బైటకు వచ్చింది. అప్పటికే తయారయి వరండాముందు నిలబెట్టిన కారులో ముందుసీటులో కూర్చుని శైలజ కోసం యెదురుచూస్తున్నాడు శ్రీధర్. సాయంకాలపు నీరెండ యింటిముందున్న మొక్కలమీాద పడి బంగారు రంగులో మెరుస్తోంది. శీతాకాలపు సాయంత్రాలు, యెండా కాలపు ప్రాతఃకాలాలు, వర్షాకాలపు రాత్రులు శైలజ కెంతో

యిష్టం. బాధ్యతల బరువుతో, ఆఫీసు గొడవలతో, కాగితాలు, పుస్తకాలతో కాలక్షేపం చేసే శ్రీధర్‌కి అన్ని రాత్రులు, అన్ని సాయంకాలాలు, అన్ని వుదయాలు అన్నీ సమానమే- శైలజ వెక్కిరిస్తూ వుండేది. ఒక్కొక్కసారి రాత్రిపూట రాసుకుందామని కూర్చుంటే శైలజ చేసే గొడవకి సాగక తెల్లవారు ఝామున లేచేవాడు శ్రీధర్. అదే సమయానికి గడియారంతో పాటు తనూ లేచి ఓ అరగంట అటూ యిటూ తిరిగివచ్చి శ్రీధర్ దగ్గరకి వచ్చి, 'బైట చాలా బాగుంది, అలా కొంచం సేపు తిరిగొద్దాం' అనేది. గొడవ భరించలేక చూస్తున్న కాగితాలు పక్కనపెట్టి శైలజని తృప్తిపరచటానికి లేచి వచ్చేవాడు. ఒక్కొక్కసారి కారులో అలా వూరి చివరదాకా తిప్పి తీసుకువచ్చే వాడు. బాధ- దిగులు తమని తాకలేవని ఒక్కొక్కసారి గర్వపడేవాళ్ళు. అందుకే యిప్పుడిలా అయిందా ? యిహా ముందు యిలాటి బాధ రాబోతోందనే యీ రెండు సంవత్సరాలు యింత ఆనందంగా గడిచిపోయినాయా ? ఆలోచిస్తున్న శైలజ తలతిప్పి శ్రీధర్ వంక చూసింది. అతను ఏం యోచిస్తున్నాడో తెలియదుకానీ దృష్టిమాటుకు రోడ్డు మీదకు తదేకంగా చూస్తోంది. 'ఏముంది ఆలోచించటానికి? ఆ మాత్రం తను వూహించుకోలేదా ? టి. బి. భార్యతో పడబోయే అవస్థలు వూహించుకుంటున్నాడేమో! అయినా తన కెలా వచ్చింది యిది? ఏమో యెలా భరించటం? శంకరం బాబాయి రెండో కోడలు సుజాతకి టి. బి. వుంది. మొదట పెళ్ళిలో యెంత అందంగా వుంది. ఆ తర్వాత సంవత్సరం దాటిందేమో—టి. బి. ప్రారంభమైంది. ఏమందులకీ తగ్గ

లేదు. ఆర్నెల్లలో యెలా అయింది? అబ్బబ్బ! యెలా భరిం చటం? తనుగూడా అంతేనా? అంత వికారంగా తయారైన తన్ని శ్రీధర్ ఆప్యాయంగా యెలా చూస్తాడు? అసలు శ్రీధర్ తనని పెళ్ళి చేసుకోకుండా వుంటే యింత బాధ వుండేది కాదేమో! కావాలని పట్టుబట్టి చేసుకున్నందుకు యిలా అయిందేమో— అది తన దురదృష్టం! లేకపోతే ఏదో సామెత చెప్పినట్లుగా అన్నీ వుండి అనుభవించనివ్వకుండా యిదేమిటి? జీవితాన్ని గురించి అందరికంటే అధికంగా తను కలలు కన్నం దుకా తనకీ శాస్తి! భవిష్యత్ ని గురించి తను యెంత అందంగా వూహించుకుంటోంది! యిప్పుడు ఏముందీ స్పష్టంగా కన్పిస్తూనేవుంది. టి. బి. పేషెంట్ గా యెక్కడో ఏదో హాస్పి టల్లో శ్రీధర్ సహృదయుడు గాబట్టి కాస్త మంచి హాస్పట ల్లోనే చేర్పించవచ్చు. దగ్గుతూ, రక్తం కక్కుకుంటూ, చుట్టూ తనలాగే బాధపడ్తున్న కుళ్ళులో ముక్కుతూ, మూలుగుతూ ఆరోగ్యంగా వున్నవారిని చూసి యీర్ష్యపడ్తూ, ఏడుస్తూ, బాధపడ్తూ యిష్టంలేక పోయినా బలవంతాన చచ్చిపోలేక బ్రతుకుతూ, డాక్టరిస్తున్న చేదు మందులు మింగుతూ, అందం అంతా పోగొట్టుకొని—చూసినవాళ్ళు భయపడేంత వికృతంగా తయారై హే— భగవాన్! ఎందుకిన్ని బాధలు? త్వరగా చచ్చి పోతేఎంత బాగుంటుంది! తనకు తెలుసు, అప్పుడు శ్రీధర్ కనీ సం తనని చూడటానికి గూడా రాడు. ఏమంటే ఆఫీసులో పని ఎక్కువగా వుందంటాడు. అవును, రావాలని ఎక్కడుంది? అందం, ఆరోగ్యం పోగొట్టుకున్న తన మొహం చూడాలని ఎక్కడ రాసుంది? బాధ అంతా తనది. త మరీ బాధను

పడ్తాంటే, బాగా ఎక్కువైపోతే యిహ లాభంలేదని డాక్టర్లు వుత్తరం రాస్తే ఒక్కసారి చూడటానికి వస్తాడేమో! అది కూడా బహుశా దగ్గరగా రాకపోవచ్చు. అవును మరి, అంటు వ్యాధి. పీక్కుపోతున్న కళ్ళతో, కళ్ళముందర తిరుగుతున్న చీకటి వలయాల్లో మృత్యువుని కౌగలించుకొనబోతున్న తను శ్రీధర్ కోసం - ఒక్కసారి శ్రీధర్ తన దగ్గరగావస్తే చాలని ఏడుస్తుంది. బలహీనంగా వుండి ఏడ్చి ఏడ్చి ఎండిపోయిన గుంటల్లావున్న ఆకళ్ళలోంచి జారిన కన్నీటి బిందువులు, వాటి బాధ యీ ప్రపంచానికి అర్థంగావు. అదే! అది తన భవిష్యత్ ఎంత భయంకరం - ఎలా భరించడం?' యీ ప్రపంచాన్ని, పక్కనున్న శ్రీధర్ని మర్చిపోయిన శైలజ ముందుకు వంగిపోయి తలకొట్టుకుంటూ "ఎలా-ఎలా-" అంటోంది యేడుస్తూ! "శైలా! యేమిటదీ?" కుడిచేత్తో డ్రైవ్ చేస్తూ ఎడంచెయ్యి జాపి భార్య నడుంచుట్టూ చేయివేసి బలంగా దగ్గరకు లాక్కుంటూ అన్నాడు శ్రీధర్. కారు వెంటనే ఆపేందుకు వీలులేదు. దగ్గర్లో మలుపు వస్తోంది. మరి కొంచెం దూరంలో దారికి అడ్డంగా నిర్లక్ష్యంగా పోతున్న ఆవుని తప్పించి డ్రైవ్ చెయ్యాలి. అతని కళ్ళుగూడా ప్రక్కకు తిప్పేందుకు వీలులేదు. రోడ్డుని జాగ్రత్తగా చూస్తున్నాయి. "వదలండి, వదలండి! కొంచెంగా యీ లోకంలోకి వచ్చిన శైలజ సగం బాధగా, సగం యేడుపుతో చెయ్యి వదిలించుకుంటూ అంది. శ్రీధర్ వదల్లేదు. కొంచెందూరం పోయింతర్వాత కారు రోడ్డువారగా ఆపుతూ "ఇక్కడ బాగుంది, కొంచెంసేపు దిగి కూర్చుందామా?" అన్నాడు "వద్దు, వద్దు! యింటికి వెళ్ళిపోదాం.

నాకు బాగాలేదు. యిక్కడొద్దు!" పక్కకు తిరిగి అతని భుజం మీద తలదాచుకుంటూ ఆవేశంగా అంది శైల. శ్రీధర్ ఆపిన ప్రదేశం శైలజ గుర్తించింది. అది తన కెంతో యిష్టమైంది. ఆ అందాన్ని యిప్పుడు తను భరించేదశలో లేదు. అందుకే వద్దంటోంది.

"యేం బాగాలేదండీ? నేనా, కారా? లేక రోడ్డా? లేకపోతే చూడు, ఆ దూరంగా కన్పించే కొండలూ - చూడు, ఈ రోజెంత బాగుందీ! నాకు కవిత్వంగూడా వస్తోంది. కావాలంటే వర్ణించేస్తాను విను - నల్లగావున్న యీ తారురోడ్డు నున్నగా తాచుపాములా వుంది. దూరంగా కన్పిస్తున్న ఆ కొండలు మన శంభు తెచ్చే బన్‌రొట్టెలా వున్నాయి. చూడు, ఆమూల కన్పిస్తున్న ఆచెట్టు నాదగ్గరకు ఫైల్ తీసుకువచ్చి నిలబడ్డ హెడ్‌క్లర్కులా వుంది. యిటు చూడు, యీ నీరెండ నేను నీకు క్యాంప్ వెళ్ళేటప్పుడు రైల్లో కూర్చుని రాసే, మెరిసే కాగితంలా వుంది. ఏదీ మరి కళ్ళుతెరు!" అలవాటుకు విరుద్ధంగా యీరోజు శ్రీధర్ అంతయిదిగా ఎందుకు మాట్లాడుతున్నాడో శైలజకు తెలుసు. సదా గంభీరంగావుండే అతను కావాలని చిలిపితనం తెచ్చిపెట్టుకుని తనని వుత్సాహపరచాలని చూస్తున్నాడు.

"వద్దు,వద్దు! వెళ్ళిపోదాం, ఇంటికి పోదాం! మరోసారి అంది శైల.

ఆ తర్వాత చాలాసేపు శైలజని ఇవతలకు దింపాలని శ్రీధర్ చేసిన ప్రయత్నం అంతా వ్యర్థం అయింది. చేసేదిలేక శ్రీధర్ తిరిగి కూర్చుని కారుని ఇంటిమొహం పట్టించాడు.

ఆ రాత్రి పడుకోబోతుండగా భార్యని పిలిచి శ్రీధర్ ఇలా చెప్పాడు: "ఇదుగో చూడు! ఈరోజునుంచీ నీకు కొన్ని ఆజ్ఞలు జారీచేస్తున్నాను, అవి నువ్వు తు. చ. తప్పకుండా పాటించాలి. ఎక్కడ యేమాత్రం నిర్లక్ష్యం చేసినట్లు కన్పించినా కోపంవస్తుంది."

"ఏమిటవి?" నిరుత్సాహంగా అడిగింది శైలజ వెంట తెచ్చిన పాలగ్లాసుని టేబిల్‌మీద పెడ్తూ.

"ఏమిటంటే, నువ్వేపనీ చేయకూడదు. అంటే – రెండు సంవత్సరాలనాడున్న రాజమ్మ మళ్ళా వంటయింటిలో ప్రవేశిస్తుంది. ఆపైన అక్కర్లేదని, అనవసరం అని యీ మధ్య తమరు తీసేసిన రాజు మళ్ళీవస్తాడు. ఆ తర్వాత సాధ్యమైనంత వరకూ నువ్వేపనీ చేయకూడదు. కావలసిన దానికంటే ఎక్కువగా విశ్రాంతి తీసుకోవాలి. ఇంకా– ఆఁ మర్చిపోయాను. మహిళామండలి కార్యదర్శి పదవికి తాత్కాలికంగా రాజీనామా ఇవ్వాలి. ఇంకా ఏమిటబ్బా? ఇప్పటికంతే! నాకు జ్ఞాపకం వచ్చినని మళ్ళా రేపు చెప్తాను. తెలిసిందా?"

మంచానికున్న దోమతెరని సరిచేస్తున్న శైలజ హఠాత్తుగా ఆగిపోయి లేచి నిటారుగా నిలబడింది. శ్రీధర్ ఏమిటన్నట్లు చూశాడు పాలగ్లాసుని తీసుకుని తాగబోతూ.

"నాకు తెలుసులెండి! మీరు చెప్పటం మర్చిపోయినవి నాకు జ్ఞాపకం వున్నాయి. నేను వంట చెయ్యకూడదు. ఎందుకంటే అది మీరు తింటే మీకుకూడా అంటుకుంటుంది నా జబ్బు. అంతేగాదు, మీ బట్టలు గూడా నేను ముట్టు

కోకూడదు. అందుకే రాజు తిరిగి మళ్ళీ వస్తాడు. ఆపైన నేను విశ్రాంతి తీసుకోవటం- అంతకంటే 'అమ్మాయి, నువ్వు నీ బట్టలు, నీ పనులు అన్నీ వేరుగా ఉండా'లని మీరు ప్లెయిన్‌గా ఎందుకు చెప్పరు? ఆమాత్రం తెలుసుకోలేననా మీ వూహ? రోగిష్టివాళ్ళు ఎలా వుండాలో నాకూ తెలుసు లెండి! మిమ్మల్ని నేనేం బాధించను, భయపడనక్కర్లేదు."

గబగబా అనేసిన శైలజ ఎఱ్ఱబడిన మొహంతో-శైలా!" అని శ్రీధర్ పిలుస్తున్నా విన్పించుకోకుండా విసురుగా రెండంగల్లో గదిదాటి యివతలకు వచ్చేసింది.

'యెందుకు తన్నిలా అపార్థం చేసుకుంటుంది? సొంతం తన మాటలు వినిగూడా'! తలపట్టుకుని శ్రీధర్ కుర్చీలోకూలబడ్డాడు. ఇంతవరకూ శైలజ యెదుటి వాళ్ళని వుత్సాహ పరచటం, తన దర్శనం మాత్రంతోనే వాళ్ళ విచారాన్ని మరిచిపోయేటట్లు చేయగల సమర్థురాలు అనుకున్నాడు. కాని... కానీ తనింతవరకూ చూడకుండావున్న మరోభాగం శైలలో వుందని యిపుడు తెలుస్తోంది. అందుకేనేమో ఆడదాన్ని అర్థం చేసుకోనటం యెవరికీ సాధ్యంగా దంటారు.

అయినా తనిప్పుడు యేమన్నాడనీ? లేదు, లేదు. తను పొరపాటు పడ్తున్నాడు. శైలజ కోపపడటంలో అర్థవుంది. దాన్ని తాను సరిదిద్దాలి. యిదిగాదు, యింతకు పదిరెట్లు విషమ పరిస్థితులు వచ్చినా శైలజని తను అర్థంచేసుకోవటానికి ప్రయత్నించాలి గాని, ఆగ్రహపడగూడదు' గ్లాసులో మిగిలిన

పాలని తిరిగి తీసుకుని తాగటానికి వుపక్రమిస్తూ అనుకున్నాడు శ్రీధర్.

శ్రీధర్ దగ్గిర్నుంచి వచ్చేసిన శైలజ వరండాలో చీకటిగా వున్న ఒక స్తంభం దగ్గర నిలబడింది. బైట వెన్నెల విచారం అంటే ఏమిటి అదెప్పుడూ నాకు కన్పించదే అన్నట్లుగా విరగబడి మెరుస్తోంది. దొడ్లో వున్న కొబ్బరిచెట్ల ఆకులు వింతగా మెరుస్తున్నాయి. ఏమిటి తనకీ బాధ ? గుండెల్లో యెవరో మంటలు పెడ్తున్నారు. అసలు తను డాక్టర్ కి ఎందుకు చూపించుకుంది? చూపించుకోకుండా వుంటే యీ బాధ వుండేదికాదు. అన్ని పనులూ మానెయ్యాలట. అప్పుడే శ్రీధర్ మారిపోతున్నాడు. తనింకా ఏం చెడిపోలేదు. ఆరోగ్యం యింకా వుందిగా! పూర్తిగా చెదలుపట్టిపోలేదు. యిప్పుడిప్పుడే ప్రారంభమైంది. అబ్బ! ఏమిటీ గుండెల్లోపోటు, దడ! శైలజ నిలబడలేక కూర్చుంది. రక్తం అంతా సలసల కాగిపోతోంది. అసలు తనని శ్రీధర్ ఏమన్నాడనీ? అతనెలా అన్నా తను మంచిభావంతో యెందుకు అర్థంచేసుకోలేదు?' మోకాళ్ళలో తలపెట్టుకుని కళ్ళు మూసుకుంటూ అనుకుంది. శైలజ కళ్ళ ముందు తను కొత్తగా పెళ్ళయి కాపురానికి వచ్చిన రోజులు జ్ఞాపకానికి వస్తున్నాయి. శ్రీధర్ కి యెవరూ లేరు. యింట్లో అంతా నౌకర్లే– అంతా ఒక కుటుంబంలాగానే వుండే వాళ్ళు. నౌకర్లు నౌకర్లుగానే వుండరు. వచ్చిన కొత్తలో ప్రతి పనీ తను చేయాలనుకునేది. తను చేద్దామని ఆలోచిస్తుండగానే ఆ పని వాళ్ళు చెయ్యటం జరిగిపోయేది. అన్నం తినడం,

కబుర్లుచెప్పడం, షికార్లు చెయ్యడం యివేనా - యివిగాక యేవో కావాలని తన మనసు కోరేది. అవును మరి, అన్నయ్యా వూరు వెడ్తూంటే వదిన బట్టలుసర్దుతూ పొందే ఆనందం అదేదో తన కర్థంగాదు. కానీ కావాలి. ఒకరోజు ఆవేశంగా యిదే తను శ్రీధర్ కి చెప్పింది. "మీ బట్టలు నేను సర్దాలి. మీ భోజనం నేను అమర్చాలి. మీ పక్క నేను వెయ్యాలి. వీళ్ళందర్నీ వాటిల్లో కల్పించుకోవద్దని మీరు చెప్పండి" అని. మొదట్లో శ్రీధర్ కి తను చెప్తున్న దేమిటో అర్థంగాలేదు. ఆ తర్వాత మరోసారి చెప్పించుకుని బిగ్గరగా నవ్వేశాడు. ఆపైన తనని దగ్గరగా తీసుకుంటూ "శైలా! నిజంగా నేను చాలా అదృష్టవంతుణ్ణి! ఈ రోజుల్లో చదువుకున్న పిల్లలు అవంటే అసహ్యించుకుంటారనుకున్నాను. నా కంతకంటే కావాల్సింది యేముందీ? నాకీ రోజున తెలుస్తోంది. నేను తెచ్చుకున్న నీలో నేను చూడని విలువ, సంస్కారంగూడా వుందని."

'అప్పుడు ఆక్షణంలో అతనికంఠంలో తొణికిసలాడ్తున్న ఆ ఆప్యాయత, గర్వం, ఆ స్పర్శలోని ఆనందం తనెలా మర్చి పోగలదు? ఇప్పుడు ఆ మాటలన్నీ ఏమయి పోయినాయి?' శైలజ కళ్ళల్లో నీళ్ళు సుళ్ళుతిరుగుతున్నాయి. యిహ 'శ్రీధర్ తన కేంగాడు. ప్రపంచంలో ఒకరి అప్యాయత, ఆదరణ లేకుండా ఎలా బ్రతకడం?' దుఃఖంలో బిగుసుకుపోతోంది శైలజ కంఠం. 'తన కెందుకిలా అన్యాయం జరుగుతోంది? ఈరోజు యివన్నీ వద్దంటాడు. రేపు యింట్లోగూడా వద్దంటాడు. అవును, అతనిష్టం మరి! కాదంటానికి తనెవరు? కావాలని తెచ్చు కున్నాడు తనని. అనుభవించాడు-అవతల పారేస్తున్నాడు. ఆ

రోజు తనని కావాలని వెతుక్కుంటూ వచ్చి శ్రీధర్ పెళ్ళి చేసుకుంటూంటే తను అదృష్టవంతురాలినని మురిసిపోయింది. బాగా అయింది. ఇదుగో అదృష్టం మేడి పండులా!' శైలజకి ఆపుకున్నా ఏడుపు ఆగడంలేదు.

"శైలా! ఏమిటిది? యిల్లంతా వెతికాను. ఛ, ఛ! శంభూవాళ్లుచూస్తే ఏమనుకుంటారు? లోపలకు పోదాం, రా!" అరగంటనుంచీ యిల్లంతా వెతికి అలిసిపోయిన శ్రీధర్ చివరికి చీకట్లో స్తంభం చాటున క్రింద కూర్చుని మోకాళ్ళ మధ్య తలదూర్చి ఏడుస్తున్న శైలజనిపట్టి లేపుతూ అన్నాడు. శైలజ కదలలేదు, లేవలేదు. రెండు చేతుల్తోపట్టి పైకెత్తి పసిపిల్లలా, పూలచెండులా చేతులమధ్య వుంచుకుని లోపలకు తీసుకొచ్చి మంచంమీద పడుకోపెట్టాడు. ఆ తర్వాత చాలాసేపటివరకూ అతని ఒళ్ళో తలదాచుకుని ఏడ్చి ఏడ్చి అలసిపోయి నిద్ర పోయింది శైలజ.

వారం రోజులు గడిచిపోయినాయి. శ్రీధర్ అలవాటు చొప్పున ఆఫీసుకు వెడ్తున్నాడు, వస్తున్నాడు. ఈ వారం రోజుల్లో శైలజ చెప్పలేనంతగా తీసేసింది. పదిరోజుల క్రిందట శైలజని ఎవ్వరూ అనుకోరు. శ్రీధర్ యెంత విశ్వప్రయత్నం చేసినా భార్య మొహంలో చిరునవ్వు తెప్పించలేకపోతున్నాడు. డాక్టరిచ్చిన మందులు శ్రీధర్ బలవంతంవల్ల ఏపూటకాపూట కొంత గొడవ జరిగితేనే కాని శైలజ తినటంలేదు. స్నేహశీలి, మృదుభాషిణి అయిన శైలజ హఠాత్తుగా ఇలా పెంకిగా, మొండిగా తయారు కావటంతో అతనికేం చేయాలో తోచ

టంలేదు. ఇంట్లో మరెవర్తైనా వుంటే సగం కాకపోతే సగమైనా శైలజ బాధని మర్చిపోవచ్చు అనుకున్న శ్రీధర్ ఓ రోజు రాత్రి కూర్చుని పెత్తల్లి కూతురు శారదని వచ్చి ఓ పదిరోజులుండమని, తనకు పిచ్చెక్కేటట్లుగా వుందని, ఉత్తరం చూసిన వెంటనే బయలుదేరివస్తే సంతోషిస్తానని వ్రాశాడు. ఈ సంగతి శైలజకు తెలియదు. వాళ్ళ అన్నయ్యా వాళ్ళని వచ్చి ఓ నెల వుండమని వ్రాస్తానంటే వద్దంది. చెప్పకుండా శారద వస్తే ఏదో చుట్టం చూపుగా వచ్చింది అనుకుంటుంది. అందుకే శైలజకు, శారదకు తను ఉత్తరం వ్రాస్తున్నట్లు చెప్పలేదు శ్రీధర్.

నాలుగు రోజులు గడిచిపోయినాయి. అనుకోకుండా శ్రీధర్ రెండోరోజు క్యాంప్ వెళ్ళవలసి వచ్చింది. అతను వెళ్ళిన మర్నాడు తను బైలుదేరి వస్తున్నట్లుగా స్టేషన్‌కు కారు పంపమని శారదదగ్గర నుంచి టెలిగ్రాం వచ్చింది. అసలు కారణం తెలియని శైలజ- శారద హఠాత్తుగా రావటం ఆనందమే అనిపించింది. తను హుషారుగా వుంటూ, చుట్టూ వున్న పరిసరాలనుగూడా వుత్సాహపరచగల చాకచక్యంవుంది శారదకి. క్రిందటి వేసంగిలో పిల్లల్తో వచ్చి ఓ నెల వుండి వెళ్ళింది. ఆ నెల యిట్టే గడిచిపోయింది. టెలిగ్రాం చూసిన శైలజ కళ్ళు గతంలోని సంఘటనలు గుర్తుకు రావటంతో వుత్సాహంతో మెరిశాయి. ఈసారిగూడా ఓ నెలరోజులు ఉంచుకోవాలి. తనకి బొత్తిగా కాలక్షేపం గావటంలేదు. శారదకి తనీవారం పదిరోజుల్నుంచీ పడ్తున్న బాధ నంతా చెప్పాలి. శారద ఒక్కత్తే తన్ని అర్థం చేసుకోగలుగుతుంది.

ఉత్సాహంనిండిన మొహంతో శంభుని వెంటతీసుకుని కారులో స్టేషన్‌కు వెళ్ళింది శైలజ.

"అదేమిటి! పిల్లలేరీ? - ఒక్కదానివే వచ్చావేం ?" ట్రెయిన్‌లోంచి వంటరిగా ఒక్క బెడ్డింగ్‌తో ముక్తసరిగా దిగుతున్న శారదవంక ఆశ్చర్యంగా చూస్తూ అంది శైలజ, శారదని తనెలా పలకరించాలో అని చేసుకున్న రిహార్సల్స్ మర్చిపోయి.

"ఆఁ, నాలుగురోజుల భాగ్యానికి వాళ్ళుగూడా ఎందుకు ? అయినా అసలు అన్నయ్య ఉత్తరం చూసిన తర్వాత నాకు కాళ్ళూ చేతులూ ఆడితేనా ? యేడీ స్టేషన్‌కు రాలేదే? ” బెడ్డింగ్ శంభుచేతికి అందిస్తూ అంది శారద. 'ఉత్తరమా ! శ్రీధర్ శారదకు వుత్తరం వ్రాశాడా ? శైలజలో వుత్సాహం గప్పున యెవరో వూదేసిన దీపంలా ఆరిపోయింది. అందుకే అన్నమాట - శారద వుత్తరంగూడా లేకుండా బయలుదేరి వచ్చింది' "అన్నయ్య యెలా వున్నాడు? డాక్టర్లు యేమంటున్నారు ?" వరసగా అడుగుతున్న శారద ప్రశ్నలకి యాంత్రికంగా జవాబు యిస్తూన్న శైలజ మనసు యెక్కడో ఆలోచిస్తోంది శారదకి ఉత్తరం వ్రాసినట్లు తనతో మాట మాత్రంగూడా చెప్పలేదు. శైలజ కళ్ళు కోపంతో ఎరుపు రంగుకు తిరిగాయి.

శారద యెందుకు వచ్చిందో అర్థమైపోయిన శైలజకి శారదంటే వుత్సాహం చచ్చిపోయింది. అసలు శారద ధోరణి గూడా మారిపోయింది, దాదాపు తన జీవితం ఆగిపోయింది.

ఇహ ముందు అనేది లేదన్నట్లుగా వ్రాశాట్ట శ్రీధర్. శారద చెప్తూంటే వింటూ కూర్చుంది శైల.

మర్నాటి సాయంత్రానికి శ్రీధర్ వచ్చాడు. సాధ్యమైనంతవరకూ వాళ్ళిద్దరికీ దూరందూరంగానే తిరుగుతోంది శైలజ. ఏదో గంటలతరబడి యిద్దరూ మాట్లాడుకున్నారు. గడియారం పదకొండు గంటలు చూపిస్తున్నా శ్రీధర్ లేచి లోపలకు రాలేదు. బెడ్ రూం కిటికీదగ్గర నిలబడి శూన్యంలోకి చూస్తూండిపోయిన శైలజ మనసు బరువుగావుంది. పోనీ తను జబ్బు నయంఅయేదాకా బెజవాడ అన్నయ్య దగ్గరకు వెళ్తే వాళ్ళు మటుకు భరించగలరా? పిల్లాజెల్లా గలవాళ్ళు. తనకి హాస్పిటల్ తప్ప ప్రపంచంలో చోటే లేదేమో-శానిటోరియమ్. ఓసారి పెళ్ళయిన సంవత్సరంలోనే తను శ్రీధర్ తో కలిసి ఓ ఆదివారం ఊరికే చూడడానికి అనంతగిరి వెళ్ళింది. ఎత్తుగా కొండమీద చుట్టూ విరబోసుకున్న స్త్రీలావున్న అడవి మధ్యగా శానిటోరియం ఉంది. ఆరోజు తన కెంత బాగా గుర్తుంది! ప్రత్యేకంగా తమకోసమని ఆరోజు అక్కడున్న ఫారెస్టు రెస్టుహౌస్ రిజర్వు చేయించుకున్నారు. ఆరోజు ఆ శానిటోరియంలోవున్న ఆ రోగుల్ని చూస్తూ శ్రీధర్ పక్కన నడుస్తున్న తను ఎంత విచారపడింది! బంగళాకి తిరిగివచ్చిం తర్వాత గూడా తను అదోమాదిరిగా ఉంటే "అందుకే నిన్నిలాంటిచోట్లకి తీసుకురాను. కొన్ని కొన్ని విషయాలు చూసి జాలిపడాలిగాని- పూరికే అవే మనస్సంతా నింపుకుని ఆలోచించగూడదు. చూడు అదిగో, అటు క్రిందగా వెళ్ళే

రైలు చూడు, ఎలా వుందో వానపాములా!" తన మెళ్ళో ఉన్నట్టి బైనాక్యులర్స్ తీసి ఇస్తూ భుజంతట్టి తన దృష్టి మార్పించి తను బైనాక్యులర్స్‌లో దూరంగా క్రిందగా పోతున్న రైలుని చూస్తుంటే ప్రక్కగా నిలబడి ఫోటో తీశాడు. బైటకు చూస్తున్న శైలజ తలతిప్పి గోడకున్న ఫోటో చూసింది. ఎంత హుషారుగా వుండేది తను! యిప్పుడు బలవంతాన తెచ్చుకుందామన్నా రావటం లేదు. అసలు తనకి నవ్వాలి, సంతోషంగా వుండాలి అన్న ఆసక్తే పోయింది. "ఇంకా నిద్రపోలేదూ నువ్వు?" శ్రీధర్ లోపలికివస్తూ కిటికీదగ్గర బొమ్మలా నిలబడ్డ భార్యని పలకరిస్తూ అన్నాడు. శారద యిలా హఠాత్తుగా వస్తుందని అతను అనుకోలేదు. అతని ప్రయత్నం వృథా కావటంగాక- మరో కొత్త సమస్యని తెచ్చిపెట్టింది. వచ్చింతర్వాత శైలజ అసలు తనతో మాట్లాడటం లేదు.

"అదేమిటి అలా నిలబడ్డావేం-మంచు వేసుకున్నావా?" యెందుకో శైలజదగ్గరగా వెళ్ళటానికి అతని మనసు జంకుతోంది పెదవులు బిగబట్టి, యెటో చూస్తూ, చలనంలేని కళ్ళతో వున్న శైలజ తనకి చెందనట్లుగా, యెవరో కొత్త వ్యక్తిలా అనిపిస్తోంది అతనికి. శ్రీధర్ ప్రక్కమీద దిండ్లు సరిచేస్తున్నాడు. ఈ మధ్య యింటి అందమే పోయింది. శైలజ యెందులోనూ కల్పించుకోవటం లేదు. యెటు ఏది సర్దితే ఆమె కోపానికి గురికావాల్సి వస్తుందోనని భయపడుతున్న శంభు, రాజుకూడా చూసీ చూడనట్లు వూరుకుంటున్నారు.

"నేను అన్నయ దగ్గరకు వెడ్తాను." హఠాత్తుగా వెనక్కు తిరిగి అంది శైలజ. శ్రీధర్ తలెత్తి చూశాడు. 'తను విం

టోంది శైలజ కంఠస్వరమేనా! అసలు మాట్లాడేది ఆ మనిషేనా! అన్నయ్య అంటే స్వంత అన్నయ్యా గూడా కాదు. సవతితల్లి కొడుకు. శైలజ ఏ పరిస్థితుల్లో ఆ యింటిని వదిలి వచ్చిందీ మర్చిపోయిందా ? ఖర్మంచాలక యెప్పుడైనా తప్పనిసరిగా వెళ్ళవలసివస్తే నాలుగు రోజులుండివస్తానని వెళ్ళి మూడో రోజునే వచ్చేస్తున్నానని స్టేషన్‌కి రమ్మనమని టెలిగ్రాం యిచ్చి వచ్చే మనిషి – ఏమో! ఎంతయినా పెంచి పెద్దచేసిన అన్నగారు అయితేమటుకు – యీ స్థితిలో – ఏదయినా అసలు శైలజ మనసులో ఉన్న దేమిటో! "యెందుకిప్పుడూ?" అర్థంగానట్లు అడిగాడు. నిజంగానే అతనికి తెలియటంలేదు.

"తెలియనట్లు అడుగుతారే? మీ మంచి కోసమే!" శైలజ మొహం యెరుపురంగుకు తిరిగింది. ఈ మధ్య తరచు తన మాటలు యిలాగే వుంటున్నాయి. అవి పట్టించుకుని మరింత రెచ్చగొట్టటం – తను బాధపడటం యీ రెండూ యిష్టంలేని శ్రీధర్ వినీ విన్నట్లు వూరుకో సాగాడు. ఈసారి గూడా అలాగే వూరుకుంటూ "సరే–నీ యిష్టం!" అన్నాడు. అవునుమరి, కాస్త వాతావరణం మారితేనన్నా మనిషి మారవచ్చు.

క్షణంసేపు శైలజ కళ్ళు అతన్ని చురుగ్గా చూశాయి. మరుక్షణంలో గ్రుడ్ల నిండా నీళ్ళు తిరిగాయి. "నాకు తెలుసు లెండి, పీడ విరగడ అవుతుందని. అవునా?" వెనక్కు తిరిగి హఠాత్తుగా కిటికీచువ్వలకేసి తలగొట్టుకుంటూ ఏడవసాగింది శైలజ.

"అబ్బబ్బ! శైలా!" శ్రీధర్ ఒక్కంగలో వచ్చి బలవంతంగా తనవైపుకి లాక్కుంటూ అన్నాడు.

"అక్కర్లేదు! వదలండి, నాకు తెలుసు! నన్ను మీరు ముట్టుకోనక్కర్లేదు. నిజంగా చెప్తున్నాను" తనని దగ్గరగా తీసుకుంటున్న భర్తని విసురుగా తోసేస్తూ అంది. శ్రీధర్‌కి ఏంచెయ్యాలో తోచలేదు. వద్దంటే బాధపడ్తుందేమోనని, సరే అంటే స్వార్థం అనుకుంటుంది. ఎలా? యింతవరకూ శైలజకి తనచుట్టూవున్న వాతావరణాన్ని స్వర్గంగా మార్చగలగటమే చాతనవును అనుకుంటున్నాడు. అదేంలేదు. కావాలనుకుంటే నరకంగూడా సృష్టించి ఎదుటవాళ్ళని పిచ్చి వాళ్ళని చెయ్యగలు! విసిగిపోయిన మనసుతో అక్కడ్నుంచి దూరంగా వచ్చేశాడు.

పిల్లల్ని వదిలిరావడంవల్ల ఎక్కువ రోజు లుండటానికి వీలులేదంటూ శారద నాలుగోరోజునే తిరిగి వెళ్ళిపోవటానికి బైలుదేరింది. శైలజ మునుపటిలా శారదతో మాట్లాడక పోవటం చూసిన శ్రీధర్ నిట్టూర్పు విడిచి సరే అన్నాడు. శారద ప్రయాణం అయింది. రాత్రి బండీకి వెళ్ళిపోతోంది. శైలజ తనగదిలో పుస్తకం చదువుకుంటూ కూర్చుంది. వెళ్ళబోయేముందు శారదా, శ్రీధర్ కూర్చుని మాట్లాడుకుంటున్నారు. చదువుతున్న పుస్తకంలోవచ్చిన వాక్యాలు నోట్ బుక్ మీద వ్రాసుకునే అభ్యాసంగల శైలజ లేచి లైబ్రరీ రూంలోకి పోబోతూ శ్రీధర్ గదిలోంచి వినవస్తున్న శారద కంఠం విని ఆగిపోయింది. ఎవరూ శారదే! అవును. "ఎంత

యినా అది అంటు వ్యాధి అన్నయ్యా! నువ్వుగూడా కొంచెం నీ ఆరోగ్యం సంగతి చూసుకోబోతే ఎలా ?"

"ఏం చెయ్యను శారదా ? యిప్పటికే శైల ఊరికే బాధపడ్తోంది. ఇహా నే నలా చేశానంటే ముందు జబ్బుమాట అటుంచి నేను పీక్కుతిన్నవాడి నవుతాను" బాధ గూడుకట్టు కున్న స్వరంలో అంటున్నాడు శ్రీధర్. నోట్ బుక్ మాట మర్చిపోయి శైలజ వెనక్కు తిరిగి వచ్చింది. తలుపు గడియ పెట్టి గదిలో కూర్చుంది. తన కింతవరకూ తెలియని ఒకకొత్త సత్యాన్ని శారద వేలెత్తి చూపించింది! ఎంతవరకూ తన బాధ చూసుకుంటోంది గాని, శ్రీధర్ సంగతి ఒక్క సారిగూడా తను ఆలోచించ లేదేం? ఒకవేళ శ్రీధర్ కి గూడా టి. బి. వస్తే – అందంగా వంపులు తిరిగి బలిష్టంగావున్న ఆ శరీరం – శైలజ కళ్ళు గట్టిగా మూసుకుంది. తన కీ బాధ నుంచి విముక్తి యెప్పుడు? అదుగో– శ్రీధర్ శంభుని కేక వేస్తు న్నాడు. కారుని గారేజ్ నుంచి బైటకు తియ్యమనిలావుంది. శారద వెళ్ళిపోతోంది–వెళ్ళిపోనీ, ఛీ! కనీసం సాటి స్త్రీ అని అయినా లేకుండా యెలాటి ఆలోచన చెప్తోందో! తన ఆరో గ్యం చూసుకోక శ్రీధర్ చేస్తున్నది ఏముంది ? ఛ!' జీవితంలో మొదటిసారిగా మనుష్యుల్ని అసహ్యించుకుంటూ అనుకుంది శైలజ.

"శైలజా ! తలుపు తియ్యి, నే వెడ్తున్నాను." శారద వచ్చి తలుపుతట్టింది. విన్పించిగూడా విన్పడనట్లు వూరుకుంది శైలజ. అవును మరి—తన మొహంలో వున్న కసి, ద్వేషం— అసహ్యం వాళ్ళు గుర్తుపట్టవచ్చు.

"శైలా! యేమిటా పిచ్చితనం, శారద వెడ్తూంటే! తలుపు తియ్యి!" శ్రీధర్ కోపంగా పిల్చాడు. గదిలోపల మంచంమీద పెదవులు గట్టిగా బిగబట్టి కూర్చున్న శైలజ కళ్ళ నిండా నీళ్ళు తిరిగాయి. శ్రీధర్‌కి తన పేరెత్తితేనే కోపం వస్తోంది. తనేంచేసిందనీ? టి.బి. రావటం తనుచేసిన దోషమా? అది-భగవంతుడే అన్యాయంచేశాడని తను ఏడుస్తూంటే పీళ్ళు గూడా ఏమిటి? అసలు మగవాళ్ళ స్వభావమే అంతేమో! అందంగా, ఆరోగ్యంగా ఉంటే అనుభవిస్తారు, అవిపోతే నలిపిన పువ్వుని గిరాటు కొట్టినట్లు అవతల పారేస్తారు. అందుకే ఇందిర మగవాళ్ళందర్నీ చెత్తకుండీలు అంటుంది. అసలు-ఈ ఆడవాళ్ళకీ బుద్ధిలేదు. లేకపోతే యుగయుగాలనుంచీ తరతరాలుగా తరక్కుండా వాళ్ళలో కన్పిస్తున్న ఆకర్షణ ఏమిటి? దగా, మోసం తప్పితే-ఆడది బాధ, అసంతృప్తి తనలో దాచుకుని మగవాడికి తృప్తిని, ఆనందాన్ని యిస్తుంది. అవి కాస్త యిచ్చేవరకూ నాలుగు కబుర్లు చెప్పి ఆపైన మొండి చెయ్యి చూపిస్తాడు. అసలు ఆడదిగూడా మగవాడిలాగానే అదో అనుభూతి క్రింద ఎందుకు తీసుకుని వదిలెయ్యదు? అందుకే ప్రపంచంలో ఆడదానికి ఇన్ని బాధలు. తనుమటుకు తనేమనుకున్నది? శ్రీధర్ని పెళ్ళాడగానే నా అంతటి అదృష్టవంతురాలు లేదని మురిసిపోలేదూ! అందులో తన తప్పేం వుంది? అమాయకురాలు గాబట్టి అవన్నీ నిజం అని నమ్మింది. అదిగో - కారు చప్పుడు విన్పిస్తోంది. శైలజ లేచివచ్చి తలుపు తెరిచి చూసింది. అప్పటికే కారు వెళ్ళిపోయింది.

ప్రపంచంలో మనిషికి అసలు రోగం అంటూ ఎందుకు వస్తుంది ? ఆ సమయంలో శైలజని యీ ప్రశ్న ఎవరైనా అడిగితే ఎవరెవరికి మనం అంటే నిజమైన ఆదరణ, అభిమానం వుందో తెల్పటానికి అని ఠకీమని జవాబు యిచ్చి వుండేది. ఒక విధంగా తనకి యీ టి. బి. రావటం చాల మంచిదే అయింది. లేకపోతే వీళ్ళందరి యీ స్వభావాలు ఎలా తెలుసుకోవటం? శారద వెళ్ళిపోతోంది. క్రిందటిసారి వచ్చినప్పుడు తను గూడా వెళ్ళింది స్టేషన్‌కు. బాబుని తను ముద్దాడ్తూంటే "త్వరగా ఓ పిల్లని పుట్టేసరి, దగ్గరే పెట్టుకోవచ్చు అల్లుణ్ణి" నవ్వుతూ అంది శారద. తన కా రోజు ఎంత సిగ్గేసింది! తను నవ్వుతూ ఓరగా చూసినప్పుడు శ్రీధర్ తనవంక చూడటంలో గల మెరుపులు త నెలా మర్చిపోగలదు? ఆరోజు తన కెవరయినా నువ్విలాటి సంతోషాలకు తగవు అని చెప్పి వుంటే ఎంత బాగుండేది! యీ సరికి శారదా, శ్రీధర్, స్టేషన్‌కు చేరుకుంటారు. టైమ్‌కు వెళ్ళారు గాబట్టి ట్రెయిన్ యీపాటికి ప్లాట్‌ఫారమ్ మీదకు వచ్చేవుంటుంది. శారద కంపార్ట్‌మెంట్‌లో ఎక్కి మరోసారి 'నీ ఆరోగ్యం జాగ్రత్త'ని శ్రీధర్ని హెచ్చరిస్తుంది గాబోలు. అప్పుడు శ్రీధర్ ఏమంటాడు ? ఏముంది అనేటందుకు అంతా ఖర్మ అంటాడేమో ! లేక దురదృష్టం అంటాడో ! ఒకరోజు తన అదృష్టంగా మురిసిపోయిన శ్రీధర్ యీనాడు దురదృష్టం అనుకోవటం ఎవరి ఖర్మ ! అసలు ఇంత వ్యథపడ్తూ తనకి, తన చుట్టూ వున్న వాళ్ళకి మనశ్శాంతి లేకుండా బ్రతికి ప్రయోజనం?' శైలజ నిట్టూర్పు విడుస్తూ అనుకుంది. 'అవును, తను వుండి సమస్యగా

రూపొందేకంటె అసలు లేకుండా పోవటం మంచిదేమో! యేం చచ్చిపోతే? ఎప్పటికయినా అది జరిగి తీరాల్సిందేగా! చావు అంటే యీ చైతన్యం, ఈ స్పర్శ ఏమీ లేకుండా మొద్దుబారి పోవడమా? మనిషికి ఆఖరి అనుభవం అన్నమాట! ఇప్పుడు అర్థమౌతోంది. ఇంత తేజోవంతమైన లోకాన్ని, సౌందర్యాన్ని వదలుకుని మనిషి బలవంతాన తన్ని తను లేకుండా చేసుకోవాలని యెందుకు తాపత్రయ పడతాడో! ఇదివరకు ఎవరైనా ఆత్మహత్య చేసుకున్నారని తను వింటే వాళ్ళని అసహ్యించుకునేది. బ్రతకడం చాతకాని దద్దమ్మలని తీసిపారేసేది. మరి ఇప్పుడు! చచ్చిపోతానని తెలుసుగాని, ఎప్పుడో ఎక్కడో అనుకుంది. కానీ ఇంత త్వరలో తన్ను వెంట నంటుకునే ఉందని ఎలా అనుకుంటుంది? అందం, ఆరోగ్యం పోగొట్టుకుని జీవచ్ఛవంలా బ్రతికేకంటె చచ్చిపోవడం సుఖంగానే తోస్తోంది! మరి తను చచ్చిపోతే శ్రీధర్‌కి ఏమీ అన్పించదా? తను లేని లోటు అతని జీవితానికి ఏమీ లోపంగానే తోచదా? ఏమిటా పిచ్చితనం తనకి! తనిప్పుడు చచ్చిపోతే రేపీ పాటికి అతను పెళ్ళికొడుకై పీటలమీద కూర్చోడూ? ఏంతక్కువనీ అతనికి? అందం, ఆరోగ్యం, చదువు, సంస్కారం, పురుషత్వం మూర్తీభవించిన అదృష్టం-అంతకంటే ఏం కావాలి?' శైలజ కళ్ళకి దూరంగా ఎక్కడో శ్రీధర్ ఎవర్నో ఆప్యాయంగా దగ్గరకు లాక్కుని జడలో గులాబి ఉంచుతున్నట్లు, కారులో కూర్చోపెట్టుకుని షికారుకు తీసుకు వెడ్తున్నట్లు, ఏదో చీకటి ప్రదేశంలో పచ్చగడ్డిమీద వెల్లకిలా పడుకుని గడ్డిపరకలు తెంపి వాటిని ముక్కలుచేస్తూ

ఆకాశంలోకి చూస్తూ ప్రక్క నున్న వ్యక్తికి ఏదో చెప్తున్నట్లు అన్పించింది. ఏం చెప్తాడు ? ఆకాశంలో తారట్లాడ్తున్న తెల్ల మబ్బులు అతనికి తన్ను గుర్తు చేయవచ్చు. వాటిని చూడటం ఇష్టంలేక ప్రక్కకు తిరిగి కూర్చున్న వ్యక్తితో ఇంకా ఏదయినా మాట్లాడ్తూండవచ్చు. తనసలప్పుడు నామ మాత్రంగానైనా గుర్తుండకపోవచ్చు. అబ్బ ! ఏమిటీ, శరీరం ఇలా ఉడికిపోతోందే ! ఈర్ష్యా—కాదు ద్వేషం. ఏమిటీ ? ఏదో జ్వాల ముట్టినట్లు తను దహించుకు పోతున్నట్లు అన్పిస్తోందే ! తన గతంలో ఒక స్మృతి తప్ప శ్రీధర్‌కు ఏమీ కాదన్నమాట. తనతో అతను గడపిన ఈ రెండు సంవత్సరాలూ ఏమీకావు. తనతో అతను చెప్పినవన్నీ వట్టిమాటలేనా ? పైపెచ్చు ఆ వ్యక్తితో, శైలజతో నేనేం సుఖపడలేదని గూడా చెప్పవచ్చేమో ! అప్పుడు ఆ అమ్మాయికిగూడా టి. బి. వస్తే— లేకపోతే అసలు శ్రీధర్‌కే వస్తే ! అప్పుడు శారద ఏమంటుందో ! అసలు శ్రీధర్ ఆరోగ్యం చెదరదు. అది తనకు దృఢంగా తెలుసు. తను వచ్చిన యీ రెండు సంవత్సరాల్లో అతను సుస్తీపడటం గాదుకదా, కనీసం తలనొప్పి అనిగూడా బాధపడలేదు. సాధారణంగా కాస్త పున్నవాళ్ళకి మందులూ అన్నీ యిన్నీ అవసరం అవుతుంటాయి. ఆరోగ్యంపట్ల అతను చూపించే శ్రద్ధకి తను ఆశ్చర్యపోవడమే గాకుండా ముగ్ధురాలయేది. "ప్రపంచంలో దీని తర్వాతనే అన్నీను." అనేవాడు తను యెప్పుడైనా ఆరోగ్యం గురించి ప్రసంగిస్తే. అవును, ఆ మాట లెంత నిజం ! యిప్పుడు అది లేదు గాబట్టే తనకు ఏమీ లేనట్టుగాపుంది. శైలజ కళ్ళుతిప్పి చెట్లవైపు చూసింది.

వెన్నెల్లో చెట్లు విరగబడి నవ్వుతున్నాయి. గాలికి కదుల్తున్న ఆకులు యెవరో గిలిగింతలు పెట్టినట్లు మెలికలు తిరుగుతున్నాయి. యెంత బాగుందీ ప్రపంచం! యింత అందమైన ప్రపంచం తన కే మాత్రం చెందదా? వీటన్నిటికీ తను ఎలా దూరంగా వుండగలదు? భగవాన్! ఏమిటిదారి? తన బాధ అర్థం చేసుకునేవాళ్ళు ప్రపంచంలో ఒక్కళ్ళుగూడా లేరా? అందరికీ యిప్పుడే ఏదయినా బాధ రాగూడదూ! ఒక్కసారి పెద్ద సుడిగాలి వచ్చి యీ ప్రశాంతతని మాయంచేసి యీ ఆనందాన్ని చెరిపివెయ్యగూడదూ! లేకపోతే ఓ భయంకరమైన భూకంపంవచ్చి అన్నీ ఫెళఫెళా విరిగిపడిపోకూడదూ! లేకపోతే యెక్కడైనా ఏవైనా ఖరీదుగల మేడలు వరసగా నిలబడి తగలబడిపోతూంటే ఫైరింజన్లు గణగణా చప్పుడుచేస్తూ పరుగెత్తకూడదూ! ఏదయినా సరే ఒక విపరీత నష్టం జరిగి అంతా భయంతో బీభత్సంగా కనిపిస్తున్న ప్రపంచాన్ని చూసి హాహాకారాలు చెయ్యాలి. అలా అయితే తన మనసుకి కాస్త శాంతి కలుగుతుందేమో! ఏమిటీ - రక్తం యిలా ఎందుకు వేడెక్కిందీ? ఏదో బాధ నరనరాల్లో పట్టి పీకుతోంది. దేన్నో నాశనం చెయ్యాలి -ఏదో తెలియని కసి, ద్వేషం, అసహ్యం శైలజను చుట్టుముట్టాయి. లేకపోతే క్రింద కన్పిస్తున్న ఆ తోటలోని చెట్లని పీకి ధ్వంసం చేస్తే! అవును, మొక్కలంటే శ్రీధర్‌కి ప్రాణం. అవి బర్సారా ప్లాంట్స్, శ్రీధర్ బోలెడంత డబ్బు ఖర్చుచేసి ఎంతో శ్రమపడి బెంగుళూరునుంచి తెప్పించాడు. భద్రంగా తొట్టెల్లో పెంచుతున్నాడు. వాటిని పాడుచేసేస్తే అప్పుడు శ్రీధర్ మొహంఎలావుంటుంది?

ఆపుకోలేని కోపం వచ్చినప్పుడు బిగిసిన శరీరంతో పెదవులు గట్టిగా బిగిస్తాడు. తనకేం భయంలేదు. తనని శ్రీధర్ యేం చేసినాసరే! మళ్ళా అతను వచ్చేస్తాడు. యీ లోపునే వాటిని పాడుచెయ్యాలి. శంభు, రాజు చూడరు. పడుకున్నారులా వుంది. తను పాడుచేసినట్లు గూడా ఎవరికీ తెలియదు. ఏదో తెలియని ఆవేశంలో గిరుక్కున వెనక్కు తిరిగి సుడిగాలిలా మెట్లుదిగి క్రిందకు రాబోతున్న శైలజ అప్పుడే తిరిగి వచ్చి తలవంచుకుని పరధ్యానంగా మెట్లు ఎక్కుతున్న శ్రీధర్ మీదపడి ఆగబోయి తూలిపోయి క్రిందపడబోయింది.

"ఏమిటది! నువ్వింకా నిద్రపోలేదూ?" క్రింద పడబోయిన శైలజని రెండు చేతుల్తో గట్టిగా పట్టుకుంటూ అడిగాడు శ్రీధర్. శైలజ పిచ్చిగా అతని కళ్ళల్లోకి చూస్తోంది. మొహంనిండా చెమటలు పట్టాయి. మనిషి ఆయాసంతో వూగిపోతోంది. "నేను... నేను..." శైలజ వాక్యం పూర్తి చెయ్యలేకపోయింది. "ఏమిటి-నువ్వు?" శ్రీధర్ భార్య మొహాన్ని దగ్గరగా తీసుకుని కళ్ళల్లోకి వెతుకుతూ పరీక్షగా అన్నాడు. ఎక్కడా చప్పుడు లేకపోతే శైలజ నిద్రపోయిందో లేక మేలుకూర్చుని యేదయినా చదువుకుంటోందో అనుకున్నాడు తను. 'ఏమిటిది! శైలజకి మతిపోవటంలేదు గదా!' శైలజని అలాగే గట్టిగా పట్టుకుని పైకి తీసుకువచ్చాడు. తన చేతుల్లో నీరసంగా వాలిపోయిన శైలజ యింకా అస్పష్టంగా "నేను—నేను" అంటూనే వుంది.

"ఏమిటి శైలా అది?" మంచంమీద కూర్చుని శైలజ తలని తన ఒళ్ళో పెట్టుకుంటూ అడిగాడు.

"నేను చచ్చిపోతాను!" హఠాత్తుగా యేడుస్తున్న శైలజ వెక్కిళ్ళమధ్య అస్పష్టంగా అంది.

"శైలా!" శ్రీధర్ కి నోటమాట రాలేదు. 'ఎలా తనీ గండం దాటడం? ఏంచేస్తే శైలజ కీ బాధ పోతుంది? ఇంత సున్నితమైన మనసు అనుకునివుంటే అసలు తను డాక్టరుకి చూపించేవాడు గాదు. చూపించటం ఎంత పెద్ద పొరపాటయింది! యిప్పుడు తను చేయవలసింది ఏమిటి?' కొంచెంసేపయిన తర్వాత చెమటకి ముఖాన అతుక్కుపోయిన ముంగుర్లని సవరిస్తూ మృదువుగా శ్రీధర్ యిలా అన్నాడు. "చూడు శైలా! నీ జబ్బు తక్కువ. నువ్వుపడేబాధ ఎక్కువ. ఎందుకంత భయం? నీకు ఎన్నిసార్లు చెప్పాను, ఆ విషయం నాకు వదిలెయ్యమని? నీకు ఎలావుంటే సంతోషంగా వుంటుందో చెప్పు, అలా చేస్తాను! అసలు యిది ఒక విధంగా మంచిదే అయింది తెలుసా? మామూలుగానే వుంటే ఎవరి ఆపేక్ష ఎంతో తెలిసేదిగాదు. ఇది ఒక విధంగా నా వ్యక్తిత్వానికి – నీపట్ల నాకున్న ప్రేమకి విషమపరీక్ష – నన్ను పరీక్ష చెయ్యటానికి నీ కింతకంటే మంచి సమయం దొరుకుతుందా? అసలు యీ బాధంతా పడవలసింది నేను. యిప్పుడు – యేపరిస్థితుల్లోనూ నేను నిన్ను వదలను తెలుసా! నిన్ను భార్యగా చేసుకోవాలని నేను చేసిన ప్రయత్నాలు, పడ్డశ్రమ నేను మర్చిపోయా ననుకున్నావా? అసలు నువ్వింతగా బాధపడవలసిన అగత్యం ఏమిటో నాకర్థంగావటం లేదు. రేపట్నుంచీ నేను ఆఫీసుకు నెలరోజులు సెలవురాసి యిస్తున్నాను. వుదయం నీకు చెప్దామనుకుని మళ్ళీ మర్చిపోయాను.

బొంబాయిలో శేఖరం నీకు తెలుసుగా! అతను దీనికి స్పెషలిస్ట్. నిన్ను తీసుకుని వచ్చేయ్యమని వ్రాశాడు. వాడు కాకపోతే యింకా అక్కడ చాలమంది వుంటారుకదా! ఓ నాలుగయిదు రోజుల్లో మనం వెడ్దాం. నువ్వు అన్నీ వూహించుకుని బాధపడి నన్ను బాధపెట్టున్నావు. నువ్విలా అయిపోతుంటే నీమాట అటుంచు, ముందు నేను ఆ హాస్పిటల్లో జాయి నవాల్సివస్తుంది. కనీసం నా కోసం అయినా నువ్వు ధైర్యంగా వుండు. వుంటావు కదూ!" శైలజ చేతిగాజుల్ని సవరిస్తూ ఆప్యాయంగా అడిగాడు శ్రీధర్. శైలజ మాట్లాడ లేదు. చాలా సేపటివరకూ అతని ఒళ్ళో అలాగే నీరసంగా పడుకొని వుండిపోయింది. కానీ కొంత ధైర్యం వచ్చింది. నిజంగా తను అంత బెంగపడ వలసిన అవసరంలేదేమో!

అన్నమాట ప్రకారం ఒంట్లో బాగాలేదని విశ్రాంతి తీసుకోవాలనికోరుతూ సెలవు పెట్టేశాడు శ్రీధర్. బొంబాయి ప్రయాణానికి శైలజ మొదట్లో ఒప్పుకో లేదు. వూరు - వాతావరణం మారినంత మాత్రాన వున్న రోగం యెక్కడకు పోతుంది? పై పెచ్చు కొత్తచోటు. మరింత ఇబ్బంది అనిపించవచ్చు. కానీ శైలజ అభిప్రాయంతో తనకు పనిలేనట్లు శ్రీధర్ ప్రయాణ మయ్యాడు. దిగులుగా, విచారంగా శైలజ శ్రీధర్ తో బైలు దేరింది. యెర్రగా, పొట్టిగా కొంచం దృఢంగా వుండే శేఖరం డాక్టరుకంటే లాయరైతే చాలా బాగుండే వాడు అనుకుంది శైల. శైలజావాళ్ళు వస్తున్నారని కారు తీసుకుని భార్యతో స్టేషనుకువచ్చాడు శేఖరం. రైలుదిగారో లేదో "ఏరోయ్-లా వెళ్ళావే!"తో మొదలైన కుశలప్రశ్న

నుంచి బొంబాయిలో ప్రస్తుతం జరుగుతున్న మాచెస్ వరకూ శేఖరం ఆపకుండా మాట్లాడేస్తున్నాడు. అబ్బ! యింత వాచాలత్వంగల డాక్టర్ని రోగులు యెలా భరిస్తున్నారో - పాపం శేఖరం భార్య! అతనికి పూర్తి వ్యతిరేకంగా వుంది. కొంచం చామనచాయ రంగులో కాస్తంత బొట్టుతో కళగల మొహంతో సదా నవ్వుతూవున్నట్లున్న సరోజని చూసేసరికి శైలజకు హాయి అనిపించింది. ఆడంబరంలేని ఆప్యాయత చూపించే సరోజంటే శైలజకి మరుక్షణంలోనే యిష్టం ఏర్పడి పోయింది. కొత్త మనుష్యులు, కొత్త వాతావరణం యెలా వుంటుందో అనిదిగులుపడ్తున్న శైల-సరోజ మనస్తత్వమూ, ఇల్లూ, పరిసరాలూ చూసి, మనసు మార్చుకోవలసివచ్చింది. చాలాకాలం నుంచీ పరిచయం వుండి అన్నీ తెలిసిన ఆప్తురాలిలా అడుగుతోంది సరోజ. వాళ్ళిద్దర్నీ యింట్లో దింపేసి శేఖరం, శ్రీధరం వెంటనే బైటకు వెళ్ళిపోయారు. చుట్టూ చైతన్యవంతమైన వాతావరణం, ప్రశాంతత నింపుకున్న అందమైన యిల్లు, యెంత బాగుంది!' గట్టిగా గాలి పీలుస్తూహుషారుగా అనుకుంది శైలజ క్షణంసేపు తన జబ్బుమాట మర్చిపోయి. ఆ రాత్రేం జరగలేదు. మర్నాడు హాస్పిటల్ కు తీసుకువెళ్ళి దాదాపు గంటన్నర పరీక్షచేసి "ఇదిగో శ్రీధర్! ఇలారా! ఎవర్రా నీకు టి.బి. అని చెప్పింది? అసలు నువ్వు డాక్టరుకేనా చూపించింది?" బిగ్గరగా శ్రీధర్ ని పిలుస్తూ అన్నాడు శేఖరం. అంతవరకూ దిగులు నింపుకున్న కళ్ళతో శూన్యంలోకి చూస్తూ చలనం లేకుండా బొమ్మలా కూర్చున్న

శైలజ చురుగ్గా కళ్ళు తిప్పి శేఖరంవైపు చూసింది. అదే సమయంలో లోపలకు వస్తున్న శ్రీధర్ గూడా అలాగే చూశాడు.

"అదేమిటి శేఖరం!" ఏదో చెప్పబోతున్న శ్రీధర్ని మధ్యలోనే ఆపేసిన శేఖరం విసుక్కుంటున్నట్లు మొహంపెట్టి "నీ మొహం! అనవసరంగా ఖంగారు పెట్టడం- మనుష్యుల్ని విసిగించటం చిన్నప్పట్నుంచీ నీకు అలవాటేగా! ఎవరికీ నువ్వు చూపించింది?" అన్నాడు.

"డా॥ సహజానంద! ఆయన్ని నువ్వూ ఎరుగున్నావుగా!"

"అలా చెప్పు! నీకు ఆ ముసలాయన తప్పితే ఇంకోరు దొరకలా? టి.బి. లేదు. బి. టి. లేదు. ఏమో ఎంతసేపు చూసినా ఆలసట. నీరసం తప్ప నాకేం కన్పించటంలేదు. కావాలంటే నాకు తెలినాయన ఫారెన్ రిటర్న్డ్ ఉన్నాడు. తీసుకొచ్చి చూపిస్తాను." వాష్ బేసిన్లో చేతులు కడుక్కుంటున్న శేఖరం శైలజ, శీధర్ల వైపు వీపు పెట్టి నిలబడ్డాడు.

శ్రీధర్కి ఆశ్చర్యంతో నోటమాట రాలేదు. శైలజ మొహంలో ఒకసారి వెయ్యి కాంతి పుంజాలు వెలిగినట్లయింది. కానీ మరో పది నిమిషాల్లో క్రమంగా ఆ కాంతి ఆరిపోయింది. ఏమో! శేఖరం పొరబడ్తున్నాడేమో! లేని రోగాన్ని ఉందని చెప్పవలసిన అవసరం డా॥ సహజానందకి ఏమొచ్చింది?

"ఒకసారి ఆయనకి కూడా చూపిస్తాను. అనుమానం తీర్తుంది." శైలజ మొహంలో క్రమంగా ఆరిపోతున్న కాంతిని

చూస్తూ అన్నాడు శేఖరం. శ్రీధర్ మొహమాటానికి వద్ద న్నాడు. శైలజ వినీ విన్నట్లూరుకుంది. శేఖరం వెళ్ళి ఆయన్ని తీసుకొచ్చాడు. అవీ ఇవీ పెట్టి అరగంట కూడా పరీక్ష చెయ్యకుండానే ఆయన ఏమీ లేదని, చాలా బలహీనంగానే గాక ఏదో ఎప్పుడూ అశాంతితో బాధపడుతున్నట్లుందని ఏవో రెండు టానిక్‌లు వ్రాసి యిచ్చి వెళ్ళిపోయాడు. అంతా కలిసి యింటికి వచ్చారు. "బావుంది! చాలా బావుంది! జబ్బు లేకుండానే మందులు తిందన్నమాట మా మరదలు" సరోజ హుషారుగా చప్పట్లు చరుస్తూ నవ్వుతూ అంది. శైలజ చిరునవ్వు నవ్వింది. చాలారోజుల తర్వాత భార్య మొహంలో మామూలు చిరునవ్వు చూసిన శ్రీధర్ హృదయం తేలికపడింది. మరుక్షణంలో ప్రపంచం అంతా అందంగా, తేలికగా సంతోషంగా నవ్వుతున్నట్లుతోచింది అతనికి. శైలజ మొహంలో ఆ ఒక్క చిరునవ్వు లేకపోయేసరికి తన మనస్సంతా బరువుగా అన్పించింది ఎందుకో అనుకున్నాడు.

శ్రీధర్ సెలవు ఇట్టే అయిపోయింది. అసలు జబ్బు లేకుండా మందులు తినటంవల్ల శరీరంకొంచంగా దెబ్బతిందనీ, అది మామూలుస్థితికి రావాలంటే మళ్ళీ మందులు తినాలని శేఖరం రోజూ శ్రద్ధగా ఏవో మందులు తినిపించాడు. శేఖరం మీద అమితమైన గురియేర్పడ్డ శైలజ అతనిమాటని తు. చ. తప్పకుండా ఆచరిస్తోంది. ఇదివరకు మందు తిన్పించాలంటే తనుపడే అవస్థ గుర్తుకువచ్చిన శ్రీధర్ చిరునవ్వుతో ఇప్పుడు శ్రద్ధగా గుర్తు పెట్టుకుని మరీ తింటున్న శైలజవైపు అలా చూస్తూ కూర్చుండిపోయేవాడు. "ఏం నవ్వక్కర్లేదు! అసలు

ఏ జబ్బూ లేకుండా మందు తినమంటే యెవరు తింటారేమిటి?"
ఏదో వుందని తను ఏదో అయిపోతోందని బాధపడి అనవస రంగా శ్రీధర్‌ని పెట్టిన అవస్థలు జ్ఞాపకం వచ్చిన శైలజ సిగ్గుతో మొహం కందిపోగా అది దించేసుకుని కోపగించు కుంటున్నట్లుగా అనేది.

'ఛి, ఛీ! తనెంత అసహ్యంగా ప్రవర్తించింది! అసలు ఈ సహనం, ఈ ప్రశాంతత అప్పు డేమయిపోయినాయి? అలవాటుకి విరుద్ధంగా చీటికి మాటికి పోట్లాడటం శ్రీధర్‌లో తప్పులు వెతకటం-ఛీ! శ్రీధర్ గాబట్టి సరిపోయింది. యింకో రయితే? తను యెన్నివిధాల మాటలనేది?యెందు కంత అస హ్యంగా ప్రవర్తించింది తను?' పశ్చాత్తాపంతో శైలజకళ్ళు తడి అయినాయి.

"శైలా! ఇలారా! ఏమిటది?" మొహంలో-అంతలో మళ్ళీ భావాలు రంగులు మారిపోతున్న శైలజని చేయిపట్టి దగ్గర తీసుకుంటూ "ఏమిటిది? మళ్ళీ ఏమయింది? నేనేమీ అనలేదుగా!"—భార్య కళ్ళల్లోకి పరిశీలనగా చూస్తూ ఆదుర్దా నిండిన స్వరంతో అన్నాడు. క్షణంసేపు శ్రీధర్ కళ్ళల్లోకి లోతుగా చూసిన శైలజ నెమ్మదిగా కళ్ళు దించేసుకుంటూ "మీరు నన్ను క్షమించాలి!" అంది.

"ఓహ్, అదా! ఎందుకండీ? ఏం తప్పు చేశారనీ?" వంగి శైలజ నుదురుమీద ముద్దు పెట్టుకోబోతున్న శ్రీధర్ "శైలా!"—అన్న సరోజ పిలుపుతో చటుక్కున ఆగిపోయి శైలజ చేయి వదిలేశాడు.

"వస్తున్నా!" శ్రీధర్ వైపు చూసి నవ్వి శైలజ వెళ్ళిపోయింది.

సెలవు అయిపోయింది. శ్రీధర్ తిరిగి ఆఫీసులో జాయిన్ అవవలసినరోజు దగ్గరికి వచ్చింది. దిగులుగా బరువుగా ఏదో పోగొట్టుకున్నట్లు, ప్రపంచం నాకు సంబంధించదు అన్నట్లు వచ్చిన శైల ఆరోగ్యం పొందటమేగాకుండా మనసంతా ఆనందం నింపుకుని, తన దర్శనమాత్రంతో పరిసరాలన్నీ సుందరమయంగా చేయగలమనే రీవితో తిరుగు ప్రయాణానికి సిద్ధమైంది.

వెళ్ళిపోతున్న దంపతులకి వీడ్కోలు చెప్పటానికి స్టేషన్‌కు సరోజ, శేఖర్ వచ్చారు. తమ జీవితాలకి మళ్లా వెలుగు, ఆనందం యిచ్చిన యీ యిద్దర్నీ వదిలి వెళ్ళటం శైలజ, శ్రీధర్లకి బాధగానే వుంది. యింక కొద్దిసేపటిలో ట్రెయిన్ కదలబోతుందనగా శ్రీధర్ శేఖర్ని ఆప్యాయంగా కౌగలించుకుంటూ "ఆజన్మాంతం కృతజ్ఞుణ్ని రా!" అన్నాడు.
"ఏడిశావ్! వెళ్ళగానే వుత్తరం వ్రాయి. ఏదో ఈ రూపేణా వచ్చావుగాని—నీ యెత్తు ధనం పోస్తేమటుకు ఆ ఆఫీసు, కాగితాలు వదులుకుని వస్తావా నువ్వు? నేను ఈ విషయంలో శైలజకు కృతజ్ఞత చెప్పుకోవాలి" ప్రియమిత్రుడు, వెళ్ళిపోతున్నాడంటే అతనికీ బాధగానే వుంది. మళ్ళీ తను, రోగులు డిస్పెన్సరీ—మామూలు జీవితం—నిట్టూర్పు విడుస్తూ అనుకున్నాడు శేఖరం.

సరిగ్గా ట్రెయిన్ కదలబోతుండగా హఠాత్తుగా హాండ్ బాగ్ తెరిచి సరోజ ఓ ఉత్తరాన్ని శైలజ చేతిలో పెట్టూ "యిది చదివి నువ్వు పొందిన అనుభవాన్ని వెంటనే వెళ్ళ గానే వుత్తరం వ్రాయి" అంది.

"ఏమిటిది ?" తెల్లబోతూ అడిగింది శైలజ.

"చదువుతావుగా !" సరోజ అంటుండగానే అప్పటికే కదిలిన ట్రెయిన్ పరుగు అందుకోబోతోంది. హడావుడిగా దిగేశారు శేఖర్, సరోజ. ట్రెయిన్ వేగం అందుకుని పరుగు ప్రారంభించింది. "ఏమిటిది?" భార్యప్రక్కన కూర్చుని ఆసక్తిగా అడిగాడు శ్రీధర్.

"వుత్తరం—ఏమిటిది సరోజ వ్రాతలావుందే! చదవనా?" శైలజ చదవటం ప్రారంభించింది.

"శైలజా !

మన్నించాలి! అయినా చెప్పకతప్పదు. ముందు ముందు మీరు మళ్ళీ బాధపడతారేమోననేభయంతో యిలా చేస్తున్నాం. వున్న విషయాన్ని సింపిల్‌గా ప్లెయిన్‌గా చెప్పేస్తాను. మీరు మీ వూరు వెళ్ళిం తర్వాత డా॥ సహజానందం దగ్గరికు వెళ్ళి ఆయనతో పోట్లాట పెట్టుకుంటారేమోననే భయమే లేకపోతే, నే నిప్పుడు ఈ వుత్తరం వ్రాయవలసినపనే లేకపోయేది. మిమ్మల్ని యెలా హెచ్చరించాలో, ఏవిధంగా వున్న విషయం చెప్పాలో తెలియక తికమకపడి చివరికి యీ నిర్ణయానికి వచ్చాం. శైలా ! ఖంగారుపడకుండా వుత్తరం

చివరిదాకా చదువు! డా॥ సహజానందం చెప్పింది నిజం! కానీ నువ్వు తిన్న మందులవల్లో మరి దేనివల్లో అది చాలాభాగం తగ్గిపోయింది. అందులో మీరు చాలా లేతలో కనుక్కున్నారు. ఇంకా కొద్ది ఛాయలు మాత్రం వున్నాయి. జబ్బువుందని చెప్పిందానికంటే లేదనే నమ్మకం నీలో కలిగిస్తే చాలాత్వరలో ఆ కాస్తగూడా నయం చేయవచ్చుననే నిర్ణయానికి వచ్చిన శేఖరం అలా చెప్పాడు. ఫారిన్ రిటర్న్‌డ్‌కి ముందే వున్నదంతా చెప్పి జబ్బు విషయంఅసలు లేదని చెప్పమనిచెప్పే తీసుకు వచ్చాడు శేఖరం" అంతవరకూ చదివిన శైలజ ఆపైన చదవలేకపోయింది. మనిషి ఆయాసంతో వూగిపోతోంది. చేతులు వణుకుతున్నాయి. మొహం అంతా చెమటలుపట్టాయి.

"అరె! సాంతం చదువు. యేమిటది?" అంతవరకూ ఆశ్చర్యంగా వింటున్న శ్రీధర్ శైలజ చేతిలో వుత్తరాన్ని తీసుకుంటు తను చదసాగాడు.

"నీది చాలా సున్నిత స్వభావం. బాధకు తట్టుకోపటం అటుంచి నీ వూహాలోకంతో అసలు విశ్రాంతిలేకుండా చేసుకుంటావు. శేఖరం నీకు యే జబ్బూలేదని చెప్తానే నీచేత తినిపించిన ఆ మందులన్నీ ఆ జబ్బువే—అతని ప్రయత్నం ఫలించింది. మొన్న మళ్ళీ పరీక్ష చేసినప్పుడు – ఆ ఛాయలుగూడా కన్పించలేదు. వెళ్ళగానే డా॥ సహజానందతో నువ్వు తగాదా పెట్టుకోనాల్సిన పనిలేదు. కావాలంటే నీ అనుమానం తీరటానికి ఓసారి పరీక్ష చేయించుకో. అంతే – ఉన్న విషయం

చెప్పకపోతే మళ్ళీ యెప్పటికైనా, యేదయినా బాధ కలగ వచ్చు. నువ్వు అపార్థం చేసుకోవచ్చు అని యిలా తెలియ జేస్తున్నాను. శ్రీధర్‌కిగూడా యిది చూపించు. మమ్మల్నిద్దర్నీ అర్థం చేసుకుంటావని మాకు గట్టినమ్మకం వుంది వుంటాను.

— నీ సరోజ"

హఠాత్తుగా నీరస పడిపోయిన శైలజ శ్రీధర్ మాట లతో, బుజ్జగింపులతో మళ్ళీ తేరుకుంది. వుత్తరం మళ్ళీ రెండు మూడుసార్లు చదువుకుంది. నిజం! శేఖరం అలా చెయ్యకపోతే తను మాట వినేదా? మందు తినేదా? తనని గురించి తను పడ్తున్న బాధనిగురించి శ్రీధర్ శేఖరానికి చెప్పివుండవచ్చు. యేదైనా తనకు ఆ జబ్బు నయమైపోయింది. అదీకావాల్సింది. శైలజ కళ్ళు క్రమంగా కాంతివంతమైనాయి. తన ఒళ్లో మొహం దాచుకున్న భార్యజుట్టుని ఆప్యాయంగా నవరిస్తూ శ్రీధర్ యిలా అన్నాడు: "చూడు శైలా! అదొక పీడకల అని మర్చిపో! యేదయినా అది మనం దాటివచ్చేశాం. యింక భయందేనికి? చూడు! నీకు యేదయినా అను మానం..."

"లేదు లేదు. నా కసలు అనుమానమే లేదు. మీరు నన్ను క్షమించండి!" తనకిప్పుడా ఫర్వాలేదు. యింతకంటె వెయ్యిరెట్లు యెక్కువజబ్బు వచ్చినా తను బాధపడవలసిన పని లేదు. తన గాజుల్ని సున్నితంగా కదిలిస్తున్న అబలమైన

చేతులు యిప్పుడూ తనకూడావుండి తన కండగా వుండగా భయందేనికి ? తను దేనికి భయపడాలి? తన ప్రక్కన శ్రీధర్ వుండగా అసలు తనకు సమస్య దేనికి ? అతన్ని నమ్మి నిశ్చింతగా కళ్ళు మూసుకుని జీవితమార్గాన నడవవచ్చు. దారిలో రాళ్ళు, రప్పలుంటే అతనే తప్పిస్తాడు. ఆ నమ్మకం, విశ్వాసం యిప్పుడు యేర్పడినాయి. యెంత హాయిగా వుంది! శ్రీధర్ చేతిని తీసుకుని తన మొహానికి ఆనించుకుంటూ తృప్తిగా నిట్టూరుస్తూ అనుకుంది శైలజ. శైలజని దగ్గరకు లాక్కున్న శ్రీధర్ కిటికీలోంచి పరుగెత్తే చెట్లవంక, కొండలవంక చూస్తుండిపోయాడు. భర్త తనని అలా దగ్గరకు తీసుకోవటంలో వుద్రేకంగాని, తొందరగాని ఏదో ఆత్మీయత ప్రశాంతత ఒకవిధమైన హాయిని పొందుతున్నట్లు అనుభవం పొందిన శైల "చాలు-చాలు భగవాన్! నాకీ అదృష్టంచాలు! యింతకుతప్ప నేనేం కోరను. కానీ నానుంచి ఇదిమటుకు దూరం చెయ్యకు" అనుకుంది. అలా ఎన్నో అనుభవాలని-ఎన్నో రకాల మనుష్యుల్ని మోసుకుపోతున్న రైలు అదేం తనకు తెలియవన్నట్టు మరింత వేగంతో పరుగుదీయటం ప్రారంభించింది.